
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం। 24। జూలై। 2025



5,054 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సోమశిల: జలాశయంలో బుధవారానికి 27.520 టీఎంసీలు ఉన్నాయి. 5,054 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.పెన్నార్ డెల్టా, ఉత్తర,దక్షిణ కాలువలకు 4,750 క్యూసెక్కులను వదులుతున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,03,800
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9,380
3 శాతం జీఎస్టీతో	రూ.9,661
నవర (8 గ్రా)	రూ.77,288

గరిష్టం/కనిష్టం
31.3 /27.9

వాతావరణం

జిల్లాలో గురువారం వాతావరణం పాక్షికం గా మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ వర్ష సూచన ఉండే అవకాశం. బుధవారం గాలిలో తేమ 67 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

రిజిస్ట్రేషన్లు తప్పనిసరి

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్స్, డయాగ్నొస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌లు నిర్వహించే యజమానులు తప్పనిసరిగా ఏపీ అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేయించుకుని 5 ఏళ్లు పూర్తి కాబోతున్న వారు ఒక నెల ముందే రెన్యువల్ కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్స్‌లో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యశాఖకు చెందిన మెడికల్ ఆఫీసర్లు ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాలను సేకరించి ఆ జాబితాను ఆరోగ్యశాఖ కార్యాలయంలో వారం లోపు సమర్పించాలని సూచించారు. రిజిస్ట్రేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు 7 ప్రత్యేక వైద్యబృందాలను ఏర్పాటు చేశామన్నారు.

1,98,514 మందికే అన్నదాత సుఖీభవ

నెల్లూరు (పొగతోట): అన్నదాత సుఖీభవన పథకానికి సంబంధించి జిల్లాలో అర్హులైన రైతులు 1,98,514 మందే ఉన్నారన్నాని జిల్లా వ్యవసాయశాఖాధికారి సత్యవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఆధార్‌కు, ఈకేవైసీ పూర్తయి, బ్యాంక్‌కు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) లింక్ అయి 2,525 మంది ఇన్‌యాక్టివ్‌లో ఉన్నారన్నారు. బ్యాంకు అకౌంట్‌కు మ్యాపింగ్ కాని 4,389 మంది ఉన్నారన్నారు. వీరందరూ ఆధార్ లింక్, బ్యాంక్ లింక్ చేయించుకుంటే అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులవుతారన్నారు. రైతులు వారి పొలాలతోపాటు బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ లింక్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ఈకేవైసీ పూర్తయిందన్న విషయాన్ని విచారించుకోవడానికి అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటామన్నారు. మన మిత్ర వాట్సాప్ 955230009 నంబర్‌లో చెక్ చేసుకోవాలన్నారు. మరణించిన వారి వారసులు మ్యుటేషన్ చేయించుకున్న తర్వాతనే అర్హులవుతారన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులుగా ఉన్న వారు దాన్ని సరి చేసుకునేంత వరకు ఈప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ విషయంపై రైతులు ఆందోళన చెంద వద్దని తెలిపారు.

బస్సు అపహరణపై కేసు నమోదు

నెల్లూరు (క్రైమ్): ఆర్టీసీ బస్సు చోరీ ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్‌లో పార్క్ చేసి ఉన్న ఆత్మకూరు డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సును బుధవారం తెల్లవారు జామున గుర్తు తెలియని దుండగుడు అపహరించుకుని వెళ్లాడు. అప్రమత్తమైన ఆర్టీసీ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. బస్సు ఆత్మకూరు వైపు వెళ్తున్నట్లు గుర్తించి నెల్లూరుపాళెం వద్ద అధికారులు బస్సును అడ్డుకున్నారు. బస్సు నడుపుతున్న విడవలూరు మండలానికి చెందిన కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని నెల్లూరు నవాబుపేట పోలీసులకు అప్పగించారు. ఆత్మకూరు డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ ఫిర్యాదు మేరకు చోరీ ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు గతంలో నెల్లూరు నగరంలోని ఓ విద్యాసంస్థల బస్సు డ్రైవర్‌గా పని చేశాడని, కొద్దిరోజులుగా మతి స్థిమితం లేనట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు విచారిస్తున్నారు.

26న విచారణకు రావాలని అనిల్‌కు నోటీసులు

- ఆయన ఇంట్లో లేకపోవడంతో గోడకు అంటించిన పోలీసులు



అనిల్ ఇంటికి నోటీసులు అంటించిన కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్

నెల్లూరు (క్రైమ్): ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి కేసులో విచారణకు హాజరు కావాలని మాజీమంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కు మార్‌యాదవ్‌కు కోవూరు సీఐ వి.సుధాకర్‌రెడ్డి బుధవారం రాత్రి నోటీసు జారీ చేశారు. ప్రశాంతిరెడ్డి ఫిర్యాదు మేరకు కోవూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణ నిమిత్తం ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు కోవూరు సర్కిల్ కార్యాలయానికి హాజరుకావాలని నోటీసు ప్రతిని అందించేందుకు కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ నెల్లూరు ఇస్కాన్ సిటీలోని అనిల్ కుమార్ ఇంటికి వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఇంటి గోడకు నోటీసును అతికించారు.

పచ్చ కక్ష పాతమా?

అధికార పార్టీ నేతలు ప్రభుత్వ భూముల్లో ప్రకృతి సంపదను అక్రమంగా అందినకాడికి దోచేస్తున్నారు. తమ దోపిడీకి ఏకంగా ఓ గ్రామాన్ని, ఆ ఊరి ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి పేలుడు పదార్థాలు ఉపయోగించి భారీ బ్లాస్టింగ్‌లతో మైనింగ్‌కు పాల్పడుతున్నారు. పేలుళ్ల ధాటికి భూమి దద్దరిల్లి పిల్లలు, వృద్ధులు హడలిపోతున్నారు. ఇళ్ల గోడలకు పగుళ్లు వస్తున్నాయి. ఇంత విచ్చలవిడిగా మైనింగ్ చేస్తుంటే పోలీసులు, మైనింగ్, రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. మరో వైపు గతంలో మైనింగ్‌తో సంబంధం లేకపోయినా పలువురు మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి జైళ్ల పాల్జేస్తున్నారు.

- యర్రబొట్లపల్లి గ్రామానికి 200 మీటర్ల దూరంలోనే టీడీపీ నేతలు విచ్చలవిడిగా మైనింగ్
- ఒకే సమయంలో 40 నుంచి 50 డిటోనేటర్లు, జిలిటెన్‌స్టిక్స్‌తో బ్లాస్టింగ్
- పేలుళ్ల ధాటికి గుండెలు అదురుతున్నాయని గ్రామస్తుల ఆందోళన
- చోద్యం చూస్తున్న పోలీసులు, అధికారులు
- మైనింగ్, బ్లాస్టింగ్ చేయకపోయినా చేశారంటూ మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు
- మరికొందరు మాజీ మంత్రులు, నేతలు అరెస్ట్ కాబోతున్నారంటూ సోమిరెడ్డి లీకులు



యర్రబొట్లపల్లిలో మంగళవారం అర్ధరాత్రి అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు



తనిఖీ చేస్తున్న బాంబు స్క్వాడ్



అక్రమంగా మైనింగ్ చేస్తున్న ప్రభుత్వ భూమిలో పరిశీలిస్తున్న పోలీసులు

ఉదయగిరి: గత ప్రభుత్వంలో మైనింగ్‌తో సంబంధాలు లేకపోయినా.. బ్లాస్టింగ్‌లు చేపట్టకపోయినా.. ఆ పార్టీ మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేసి జైళ్లకు పంపుతున్నారు. ప్రస్తుతం టీడీపీ నేతలు భారీ పేలుడు పదార్థాలు ఉపయోగించి యథేచ్ఛగా ప్రకృతి వనరులను దోచుకుంటున్నా.. పోలీసులకు, అధికారులకు కంటికి కనిపించడం లేదు. బ్లాస్టింగ్‌ల ధాటికి తమ గుండెలు జారిపోతున్నాయని, ఇళ్ల బీటలు వారుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చేస్తున్నా.. పాలకులకు, అధికారులకు పట్టడడం లేదు. తాజాగా బుధవారం జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం తర్వాత సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ మైనింగ్ కేసులో మరో ఇద్దరు మాజీ మంత్రులు, నాయకులు జైలుకు వెళ్లబోతున్నారంటూ లీకులిచ్చారు. దీన్ని బట్టి చూస్తే బేతాళ కుట్రలు బట్టబయలవుతున్నాయి.

యర్రబొట్లపల్లి గుండెలు అదురుతున్నాయి..

ఉదయగిరి నియోజకవర్గంలో కొండాపురం మండలం యర్రబొట్లపల్లి 20 కుటుంబాలు ఉన్న ఓ చిన్న కుగ్రామం. ఈ గ్రామ సర్వే నంబరు 159లో ఉన్న 2.5 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.కోట్లు విలువ చేసే క్వార్ట్జ్ సంపద నిక్షేపాలు ఉన్నాయి. ఈ ప్రాంతం గ్రామానికి అతి సమీపంలో (200 మీటర్లు) ఉంది. ఇక్కడ లభిస్తున్న క్వార్ట్జ్ ఖనిజానికి మార్కెట్‌లో టన్ను ధర రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ధర పలుకుతోంది. దీంతో అధికార పార్టీ నేతలు ఆ గ్రామాన్ని, ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి భారీ పేలుడు పదార్థాలు ఉపయోగించి బ్లాస్టింగ్‌లు చేస్తూ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. ఒకే సమయంలో 40 నుంచి 50 చోట్ల అత్యంత శక్తివంతమైన డిటోనేటర్లు, జిలిటెన్ స్టిక్స్ ఉపయోగించి భారీ పేలుళ్లు చేపడుతున్నారు. ఈ ధాటికి పక్కనే ఉన్న ఇళ్లు బీటలు వారుతున్నాయి. పిల్లలు, వృద్ధులలు భయకంపితులు అవుతున్నారు. పశు పక్ష్యాదులు అదిరిపడి భీకరంగా అరుస్తున్నాయి. రెండు నెలల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ భూమిలో క్వార్ట్జ్ తవ్వకాలు చేపడుతున్నారు. రూ.కోట్లు విలువ చేసే సంపద యథేచ్ఛగా తరలిస్తూ అక్రమార్కులు పెద్ద మొత్తంలో ఆర్జిస్తున్నారు. బ్లాస్టింగ్‌లు, మైనింగ్‌పై గ్రామస్తులు అక్రమార్కులకు చెబుతున్నా వారి మాటను పెడచెవిన పెట్టారు. వీరికి ఎమ్మెల్యే కార్యాలయం పరివారం అండదండలు ఉండడంతో గ్రామస్తులపై బెదిరింపులకు దిగారు. మాతో పెట్టుకుంటే మీరు ప్రాణాలతో బతకడం కష్టమని హెచ్చరించారు. ఒక అక్రమ మైనింగ్, మరో వైపు అక్రమార్కుల బెదిరింపులతో జనం కంటి మీద కునుకు లేకుండా బతుకుతున్న పరిస్థితి నెలకొంది.

ఫిర్యాదు చేసినా కన్నెత్తి చూడని పోలీసులు, అధికారులు

అక్రమ బ్లాస్టింగ్‌లు, మైనింగ్‌పై యర్రబొట్లపల్లి గ్రామస్తులు పలుమార్లు అధికారులకు చెప్పినా ఫలితం కనిపించలేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే సాగితే తామంతా గ్రామం వదిలి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గ్రామస్తులందరూ ఏకమై సోమవారం అక్రమ మైనింగ్ జరిగే ప్రాంతానికి వెళ్లి పనులను అడ్డుకుని, జేసీబీ తాళం తీసుకొని తహసీల్దార్ కోటేశ్వరరావుకు అప్పగించారు. అయితే ఆయన పోలీసులకు చెప్పి చేతులు దులుపుకున్నారు. ఈ విషయమై గ్రామస్తులు అడిగితే ఎమ్మెల్యే కార్యాలయం ప్రమేయం ఉందని, తాము ఏమీ చేయలేమని చెప్పారు. అక్రమార్కులు మంగళవారం రాత్రి మళ్లీ పనులు ప్రారంభించారు. బ్లాస్టింగ్ కోసం 40 చోట్ల రంధ్రాలు వేసి నిబంధనలకు వ్యతిరేకంగా అత్యంత శక్తివంతమైన డిటోనేటర్లు, జిలిటెన్‌స్టిక్స్ అమర్చారు. ఇది గ్రహించిన గ్రామస్తులు అర్ధరాత్రి ఊరి జనమంతా మైనింగ్ ప్రాంతానికి వెళ్లి పనులను అడ్డుకున్నారు. అక్రమార్కులు బెదిరింపులు, దౌర్జన్యాన్ని లెక్క చేయకుండా ప్రాణాలకు తెగించి, అక్కడ జరుగుతున్న అక్రమ మైనింగ్ తీరును వీడియోలు తీసి మీడియాకు పంపారు. కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజకు ఫోన్ చేసి ఇక్కడ జరుగుతున్న దాష్టీకాన్ని తెలియజేశారు. ఆమె వెంటనే స్పందించి గ్రామస్తులకు రక్షణగా పోలీసులను పంపారు.

అక్రమార్కులపై చర్యలేవి?



కూటమి ప్రభుత్వం జిల్లాలోని పొదలకూరు మండలం తాటిపర్తిలో 2016లోనే మైనింగ్ కార్యకలాపాలను నిలిపివేసిన రుస్తుం మైనింగ్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారంటూ తప్పుడు కేసులు నమోదు చేసింది. మాజీమంత్రి కాకాణితోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి కేసులు నమోదు చేసి జైళ్లకు పంపుతున్నారు. ఈ కేసులో మరో మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ తోపాటు మరికొందరిని ఇరికించేందుకు బెదిరించి తప్పుడు వాంగ్మూలాలు తీసుకోవడం చూస్తే కూటమి ప్రభుత్వం భేతాళ కుట్రలు బయటపడుతున్నాయి. తాజాగా బుధవారం జరిగిన డీడీఆర్‌సీ సమావేశం అనంతరం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ రుస్తుం మైనింగ్ వ్యవహారంలో మరో ఇద్దరు మాజీ మంత్రులు, మరికొందరు వైఎస్సార్‌సీపీ నేతలు జైలుకు వెళ్లబోతున్నారంటూ చెప్పడం కూటమి కుట్రలు పరాకాష్టకు చేరాయని అర్థమవుతోంది. మరో వైపు యర్రబొట్లపల్లిలో రెవెన్యూ, పోలీసు సాక్షిగా అక్రమ మైనింగ్, నిబంధనలకు వ్యతిరేకంగా పేలుడు పదార్థాలు ఉపయోగించి బ్లాస్టింగ్‌లు జరుగుతున్నా అక్రమార్కులపై చర్యలు కనిపించడం లేదు. ఈ వ్యవహారంలో అధికార పార్టీ పెద్దల ప్రమేయం ఉండడంతో అధికారులు నోరు మెదపడం లేదు. దీనిపై ప్రభుత్వ పెద్దలు ప్రజలకు ఏం సమాధానం చెబుతారు.

అక్రమ మైనింగ్‌గా తేల్చిన అధికారులు

సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎస్సై మాల్యాద్రి బుధవారం ఉదయం అక్రమ మైనింగ్ జరిగే ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ భారీగా పేలుళ్ల కోసం భారీ పేలుడు పదార్థాలు పెట్టినట్లు గుర్తించారు. మైనింగ్ జరిగే ప్రాంతం ప్రభుత్వ భూమిగా రెవెన్యూ అధికారులు గుర్తించారు.ఈ అక్రమ మైనింగ్ విషయమై తహసీల్దార్ కోటేశ్వరరావును వివరణ కోరగా, అక్కడ జరుగుతున్న మైనింగ్‌కు ఎలాంటి అనుమతులు లేవని, అక్రమంగా క్వార్ట్జ్ తీస్తున్నట్లు గుర్తించామన్నారు. బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయిస్తున్నామని, పొక్లెయిన్ సీజ్ చేసి, అక్రమ మైనింగ్ చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సింది గా ఎస్సైకు చెప్పామన్నారు.

గుండెలు జారిపోతున్నాయి



మా ఇళ్లకు కేవలం 200 మీటర్ల దూరంలో అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. అక్కడ పెట్టే బాంబులతో మా ఇళ్ల గోడలు బీటలు పడుతున్నాయి. ఇక్కడ మైనింగ్ చేయొద్దని చెబుతున్నా వినడం లేదు. ఇదే కొనసాగితే ఊరు వదిలి వెళ్లాల్సిందే. మేము పేదోళ్లం ఎక్కడికు వెళ్లాలి. ఎలా బతకాలి. మాకు అధికారులే న్యాయం చేసి కాపాడాలి. – వరమ్మ, గ్రామస్తురాలు

ప్రభుత్వం మాదంటూ బెదిరిస్తున్నారు



అక్రమ మైనింగ్ అడ్డుకుంటే మీ అంతు చూస్తామని బెదిరిస్తున్నారు. అధికారం మాది మేము ఏమీ చెపితే అదే జరుగుతుంది. మీరు ఏ అధికారికి చెప్పిన ఏమీ చేయలేరని ధీమాగా మాట్లాడుతున్నారు. ప్రాణ భయంతో గడుపుతున్నాం. మాకు ప్రభుత్వం పెద్దలు న్యాయం చేసి అక్రమ మైనింగ్ ఆపాలి. – మాధవ, గ్రామస్తుడు

తవ్వితే పెద్ద స్కామే

- రాష్ట్రంలో అనేక చోట్ల ఆఫీసులు తెరిచి, ఏజెంట్లను పెట్టి రూ.కోట్లల్లో కాజేసిన కేటుగాళ్లు
- కుంభకోణం వెలుగులోకి రావడంతో ఒక్కొక్కరుగా బయటకు వస్తున్న బాధితులు
- రూ.వందల కోట్లు దాటుతున్న అక్రమాలు
- రుణగ్రహీతలను కలవకుండానే బ్యాంకు అధికారులు రుణాలు
- ఈ వ్యవహారం వెనుక బ్యాంకు అధికారులు, సిబ్బంది పాత్ర
- ఆందోళన ఉధృతం చేస్తామన్న గిరిజన సంఘాలు

'కుబేరా' సినిమాను మించిన స్థాయిలో సాగిన యాక్సిస్ బ్యాంక్‌లో రుణాల కుంభకోణం రోజుకో కొత్త కోణం వెలుగులోకి వస్తోంది. టీడీపీ సానుభూతిపరుడైన జర్నలిస్టు జాలి వాసుదేవనాయుడు, ఆ పార్టీ మైనార్టీ విభాగం నేత అల్లాభక్షుతో శివ, వెంకట్ కలిసి చేపట్టిన మోసం తొలుత రూ.20 కోట్ల వరకు ఉంటుందని భావిస్తే.. ఈ మోసం వెలుగులోకి రావడంతో ఒక్కొక్కరుగా వస్తున్న బాధితులను బట్టి మరుసటి రోజుకు రూ.50 కోట్ల పైమాటగా ఉంటుందని అంచనా వేశారు. తాజాగా వివిధ జిల్లాల్లో ఉన్న వీరి బాధితులు బయటకు రావడంతో రూ.వందల కోట్ల పైనే ఉన్నట్లు తెలుస్తోంది. మోసగాళ్లు, బ్యాంక్ అధికారులు కలిసి సాగించిన ఈ కుంభకోణం తవ్వితే పెద్ద స్కామే అవుతుందని పోలీస్ వర్గాల్లో సైతం గుసగుసలు వినిపిస్తున్నాయి.

నగరంలోని వనంతోపు సెంటర్లో ఇంటింటా పాచి పనిచేసుకునే చెంబేటి లక్ష్మి నిరక్షరాస్యులు. ఆమెను తమ ఆఫీసుకు తీసుకువెళ్లి ఆధార్ కార్డు తీసుకున్నారు. ఆమెతో కొన్ని కాగితాలపై ఇంగ్లిష్‌లో సంతకం పెట్టించారు. ఆమె పేరుతో రూ.20 లక్షలు రుణాన్ని మంజూరు చేయించి తమ జేబుల్లో వేసుకున్నారు. ఒక్క రూపాయి ఆమెకు ఇవ్వలేదు.

భక్తవత్సలనగర్‌కు చెందిన సుమతి వీరి వద్దకు వచ్చి రూ.5 లక్షలు బ్యాంక్ అప్పు అడిగారు. ఆమె వద్ద సంతకాలు, ఆధార్, బ్యాంక్ బుక్స్ తీసుకొని రూ. 5 లక్షలు అప్పుగా ఇచ్చారు. వడ్డీ, అసలు కలిపి ప్రతినెలా వసూలు చేశారు. ఆమె రికార్డులు యాక్సిస్ బ్యాంక్లో పెట్టి రూ.15 లక్షలు కొట్టేశారు.

కిసాన్‌నగర్‌కు చెందిన సీహెచ్ శ్రీనివాసులు ప్రింటింగ్ ప్రెస్ నడుపుకుంటున్నారు. ఆయన భార్య హైమవతి పేరుతో వారిని అప్పు అడిగారు. రికార్డులన్నీ తీసుకొని రూ.3 లక్షలు బ్యాంక్ నుంచి ఇస్తున్నామని చెప్పారు. ఆ రికార్డు బ్యాంక్ లో పెట్టి రూ.9.60 లక్షలు తీసుకున్నారు. ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా బయట కొస్తున్నాయి.

సాక్షిప్రతినిధి, నెల్లూరు: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఈ స్కామ్‌లో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ వ్యవహారంలో బ్యాంకు సిబ్బంది పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం బాధితులు బ్యాంకు వద్దకు వచ్చి సిబ్బందిని నిలదీశారు. వీరి ప్రశ్నలకు సిబ్బంది స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేకపోవడంతో వారి పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. ఈ వ్యవహారంపై బాధితులు ఏడు నెలల క్రితమే ఫిర్యాదు అందినా స్పందించని పోలీస్ యంత్రాంగం కదిలింది. తొలుత జిల్లాకే పరిమితమనుకున్న ఈ కుంభకోణం రాష్ట్ర వ్యాప్తంగా అనేక బ్యాంక్‌లు మోసపోయిన జాబితాలో ఉన్నట్లు వెలుగులోకి వస్తుండంతో పోలీసులే గుడ్లు తేలేస్తున్నారు. పెద్ద ఎత్తున బాధితులు బయటకు వస్తున్నా.. ఈ కేసు నమోదు చేసి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంత వరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక అధికార పార్టీ పెద్దల ఒత్తిడే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆఫీసులు తెరిచి.. ఏజెంట్లను పెట్టి..

కేటుగాళ్లు జాలి వాసుదేవనాయుడు, అల్లాభక్షు, శివ, వెంకట్ అనే వ్యక్తులు నాలుగు ఫేక్ సాఫ్ట్‌వేర్ కంపెనీలను సృష్టించి నిరక్షరాస్యులైన గిరిజనులను ఏకంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపించి నెల్లూరు, ముత్తుకూరు యాక్సిస్ బ్యాంకుల్లో రూ.20 కోట్ల మేర లూటీ చేశారు. ఇది లాభసాటిగా ఉండడంతో రాష్ట్రంలోని పలు ముఖ్య పట్టణాల్లో ఆఫీసులు తెరిచి, రుణాలిప్పిస్తామని వారి నుంచి ఆధార్, పాన్‌కార్డులు తీసుకుని బ్యాంక్‌ల్లో ఖాతాలు తెరిచి పాస్ బుక్‌లు, ఏటీఎం కార్డులు వీరి వద్దనే ఉంచుకుంటున్నారు. ఒక్కొక్కరి పేరుతో రూ.లక్షల్లో, రూ.కోట్లల్లో రుణాలు మంజూరు చేయించి ఈ మొత్తాన్ని తమ ఖాతాల్లోకి వేసుకుంటున్నారు. అసలైన రుణ గ్రహీతలకు రూ.1.50లకే రూ.లక్ష.. రెండు లక్షలిచ్చి వారి నుంచి నెల నెలా రికవరీ చేసుకుంటున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా రుణాల రికవరీ ఏజెంట్లను పెట్టుకుని దందా సాగించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి రుణగ్రహీలకు సంబంధించిన బ్యాంక్ ఖాతా పాస్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు ఉన్నట్లు కూడా వారికే తెలియదు.

ఏడేళ్లుగా ఒక వ్యవస్థనే సృష్టించారు

బాధితులు చెబుతున్న సమాచారం మేరకు.. దాదాపు ఏడేళ్లుగా ఈ వ్యవహారం నడుస్తునట్లు తెలుస్తోంది. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న జాలే వాసుదేవనాయుడు ఆయన బృందం ఒక పథకం ప్రకారం ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు ఇప్పటికే గుర్తించినట్లు సమాచారం. ఇందు కోసం ఆయన ఒక ప్రైవేట్ బ్యాంకింగ్ వ్యవస్థనే ఏర్పాటు చేసుకున్నారు. నెల్లూరు నగరంలోని వనంతోపు సెంటర్, బొల్లినేని ఆస్పత్రి సమీపంలో కార్యాలయాలు ప్రారంభించారు. ఇక్కడ సిబ్బందిని నియమించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్థిక అవసరాలున్న వ్యక్తులు, అమాయకులను గుర్తించడానికి ఆయా ప్రాంతాల్లో ఏజెంట్లను నియమించారు. ఈ ఏజెంట్ల నెట్వర్క్ నెల్లూరు జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాలో ఉన్నట్లు భావిస్తున్నారు.



లూటీ సొమ్ముతో జల్సాలు

అమాయకులు, నిరక్షరాస్యుల పేరుతో రూ.కోట్లల్లో రుణాలు తీసుకుని ఆ డబ్బులతో నిందితులు జల్సాలు చేస్తున్నారు. విలాసవంతమైన కార్లలో తిరుగుతూ, హోటళ్లల్లో బస చేస్తూ అధికార పార్టీ నేతలతో దగ్గరగా పరిచయాలు పెంచుకుని వారిని అడ్డం పెట్టుకున్నారు. ఇప్పటికే వీరే డైరెక్టర్లు, నిర్మాతలు, హీరోలు, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా ఒకటి.. రెండు సినిమాలు తీసి చేతులు కాల్చుకున్నారు.

దుమారంతో కేసు విచారణ వేగవంతం

బ్యాంకుల నుంచి గిరిజనులకు నోటీసులు అందడంతో వారు ఖంగుతిని బ్యాంకు అధికారులను సంప్రదించారు. ఈ వ్యవహారంపై బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు ఎనిమిది నెలల కిందట ముత్తుకూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి బాధితులు బ్యాంకు, పోలీసుస్టేషన్‌ల చుట్టూ తిరుగుతున్నా వారికి న్యాయం జరగలేదు. బ్యాంకు, పోలీసు అధికారులు వారిని పట్టించుకోలేదు. బ్యాంకు అధికారుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో కొందరు ఇళ్లు విడిచి వెళ్లిపోయారు. కొందరు బాధితులు ఇటీవల యానాదుల సంక్షేమ సంఘం ద్వారా తమకు జరిగిన అన్యాయాన్ని మీడియా దృష్టికి తీసుకువచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా పెనుదుమారమే రేపింది. దీంతో పోలీసు అధికారులు హుటాహుటిన కేసులో విచారణ వేగవంతం చేశారు. బ్యాంకు మేనేజర్‌ను ఇప్పటికే అధికారులు విచారించి ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలు, పత్రాలను సేకరిస్తున్నారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే బ్యాంకు మేనేజర్ ఎనిమిది నెలల క్రితం ఇచ్చిన ఫిర్యాదులో వాసుదేవనాయుడు పేరే కీలకంగా ఉంది. దీంతో నిందితులకు, బ్యాంకు సిబ్బందికి మధ్య ఏదైనా వివాదం వచ్చో, లేదా భవిష్యత్లో ఎప్పటికైనా ఈ వ్యవహారం వెలుగులోకి రాకతప్పదనో ఫిర్యాదు ఇచ్చి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పంచాయతీలో రూ.12 లక్షల నిధుల గోల్‌మాల్

- అవినీతిపై నేడు విచారణ

జలదంకి: మండలంలోని రామవరప్పాడు పంచాయతీలో రూ.12 లక్షల నిధులు గోల్‌మాల్‌పై గురువారం కావలి డివిజనల్ పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో విచారణ చేపట్టనున్నారు. సర్పంచ్‌గా ఉన్నం సరస్వతి, పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి ఇద్దరు కుమ్మక్కై, గ్రామంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండా, పంచాయతీ తీర్మానాలు లేకుండా పలుమార్లు సర్పంచ్ భర్త ఉన్నం రవి బ్యాంకు అకౌంట్లోకి నగదును మళ్లించారు. ఉన్నం రవి స్థానికంగా టీడీపీ నాయకుడిగా ఉంటున్నాడు. గ్రామంలో అభివృద్ధి పనులు చేయకుండా నిధులు డ్రా చేసుకున్నారనే సమాచారం గ్రామస్తులకు తెలిసింది. దీంతో వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కావలి డీఎల్‌పీఓ వెంకటరమణను వివరణ కోరగా కలెక్టక్ ఆదేశాల మేరకు పంచాయతీ నిధుల అవినీతిపై గురువారం విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

జిల్లా సైన్స్ అధికారి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): జిల్లా సైన్స్ అధికారి పోస్టుకు జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లోని సర్ప్లస్‌గా ఉన్న (క్లస్టర్ ఉపాధ్యాయులు) స్కూల్ అసిస్టెంట్‌లు (సైన్స్) ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ బాలాజీ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న సైన్స్ ఉపాధ్యాయులు ఈ నెల 26వ తేదీలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

చిన్న రథంపై మూలస్థానేశ్వరుడి విహారం



నెల్లూరు(బృందావనం): ఆషాఢ మాస శివరాత్రిని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజలను బుధవారం నిర్వహించారు. చిన్న రథంపై స్వామివారు విహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

యూరియా ఎక్కడ?

- కొరతతో అల్లాడుతున్న రైతులు
- డీఆర్సీ సమావేశంలో సాక్షాత్తు కూటమి ఎమ్మెల్యేలే అసంతృప్తి
- పూర్తిస్థాయిలో చర్చకు సమయం లేదా?
- రెండు శాఖలకే పరిమితం

నెల్లూరు(పొగతోట): రైతులకు అండగా ఉన్నామని కూటమి ప్రభుత్వం చెబుతున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డీఆర్సీ సమావేశంలో దీనిపై చర్చ జరిగింది. సాక్షాత్తు కూటమి ఎమ్మెల్యేలు యూరియా కొరతపై అసంతృప్తి వ్యక్తం చేశారంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రైతులకు ప్రయోజనం జరగడం లేదని ఎమ్మెల్యేలు అనడం కూటమి పాలనకు అద్దం పడుతోంది. నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఇన్‌చార్జి మంత్రి మహ్మద్ ఫరూక్ అధ్యక్షతన డీఆర్సీ సమావేశం జరిగింది. దీనికి మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్ హాజరయ్యారు. పూర్తి స్థాయిలో చర్చించేందుకు మంత్రులకు సమయం సరిపోలేదు. 18 శాఖలకు సంబంధించి సమీక్ష నిర్వహించేందుకు అధికారులు అజెండా రూపొందించారు. అయితే సమావేశం గంట ఆలస్యంగా ప్రారంభమైంది. కేవలం వ్యవసాయ, ఇరిగేషన్ శాఖలపై మాత్రమే సమీక్షించారు. హౌసింగ్‌పై కొద్ది సమయం చర్చించారు. వచ్చిన దగ్గర నుంచి మంత్రులు సమయంపైనే అధికంగా దృష్టి కేటాయించారు.

ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

- కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ధాన్యం ధరలు అతి తక్కువగా ఉన్నాయన్నారు. ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రైస్‌మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీ తీసుకుని సీఎంఆర్ ప్రక్రియ ద్వారా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయాల్లో ఉద్యోగుల కొరత వల్ల ఈకేవైసీ ప్రక్రియ పూర్తి కాలేదన్నారు.
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యూరియా కొరత ఉందన్నారు. అధిక ధరలకు అమ్ముతున్నా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లాలో మొదటి పర్యాయం రెండో పంటకు యూరియా కొరత రావడం ఏమిటని ప్రశ్నించారు. కలెక్టర్ స్పందిస్తూ ఎక్కడా యూరియా కొరత లేదన్నారు. రైతులు మోతాదుకు మించి వినియోగించడంతో నష్టపోతారన్నారు. యూరియాను అధిక ధరలకు విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.
- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ గతంలో ఉదయగిరి ప్రాంతంలో 76 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నారన్నారు. ప్రస్తుతం 40 మందే ఉన్నారని, దీంతో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు.
- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ రైతులకు ప్రయోజనం జరగడం లేదన్నారు. వారి పక్షాన ప్రభుత్వం పనిచేయాలని కోరారు. యూరియా అందక గగ్గోలు పెడుతున్నారన్నారు. గత సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రూ.8.63 కోట్ల కమీషన్ చెల్లించాల్సి ఉందన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఫరూక్, ఆనం, నారాయణ, చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్

చర్యలు చేపట్టాలి

ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో అవసరమైన మార్పులు తీసుకొచ్చి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. మంత్రి ఆనం మాట్లాడుతూ చివరి ఆయకట్టు భూములకు నీరందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో 1,06,800 బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. 1,825 మంది మార్గదర్శకులుగా ఉంటూ 25 వేల కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అనేకమంది గిరిజనుల పేర్లతో ఇతరులు ఇళ్లు నిర్మించుకున్నారని, దీనిపై పూర్తిస్థాయిలో పరిశీలిస్తామన్నారు. అనర్హులకు ఇళ్లు మంజూరు చేసి ఉంటే రద్దు చేసేలా ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. సమావేశంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సూత్రధారి ఎవరో?

- ఎర్రచందనం తరలిస్తూ దొరికిన యువకుడు
- గ్రామాన్ని జల్లెడ పడుతున్న పోలీసులు

ఉలవపాడు: ఓవైపు రైతుల ఉద్యమంతో రాష్ట్ర వ్యాప్తంగా కరేడు పేరు మారుమోగుతోంది. మరోవైపు ఎర్రచందనం స్మగ్లింగ్ విషయం నాలుగు రోజులుగా చర్చనీయాంశమైంది. గ్రామానికి చెందిన లంకా వినోద్‌రెడ్డి ఎర్రచందనం దుంగలు చెన్నైకి తరలిస్తూ తిరుపతి జిల్లా వరదయ్యపాళెంలో పోలీసులకు ఈనెల 17వ తేదీన దొరికాడు. దీంతో అటవీ, పోలీసు శాఖల అధికారులు మూడు రోజుల నుంచి కరేడు ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. ప్రధానంగా ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులు గ్రామంలో ఉండి కేసు గురించి ఆరాతీస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ బడా నేతపై పోలీస్ శాఖ దృష్టి పెట్టినట్లు సమాచారం. గత ఎన్నికల్లో కూటమి నేతలకు మద్దతు తెలిపిన నాయకుడికి వినోద్ అనుచరుడిగా ఉన్నాడు. అతడి పాత్ర ఉంటుందేమోనని విచారణ జరుగుతున్నట్లు తెలిసింది. అయితే పోలీసు శాఖ మాత్రం దీనిని ధ్రువీకరించడం లేదు. బుధవారం కరేడుకు చెందిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఒకరిని మాత్రం తమ వద్దే ఉంచుకున్నట్లు సమాచారం. గ్రామానికి చెందిన ఓ కార్పెంటర్ సహకారంతో దుంగలను మూడడుగుల పొడవు, ఒకడుగు వెడల్పుతో కోయించినట్లు సమాచారం. వీరికి కప్పరాళ్లతిప్పకు చెందిన వ్యక్తులు కూడా తోడయ్యారు. కరేడు, కప్పరాళ్లతిప్ప వద్ద ఉన్న దుంగలు మొత్తం లోడ్ చేసుకుని వెళ్తా దొరికిపోయినట్లు సమాచారం.

అలా చేయాలని..

ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో అధికార పార్టీ నాయకులు తొలుత వైఎస్సార్‌సీపీపై తప్పుడు ప్రచారం చేయాలనుకుని భావించి భంగపడ్డారు. తీరా చూస్తే వారు గత ఎన్నికల్లో కూటమి ఎంపీ అభ్యర్థి కోసం పనిచేశారని తెలిసి ముక్కున వేలేసుకున్నారు. ప్రశాంతంగా ఉండే కరేడులో స్మగ్లింగ్ జరుగుతోందని తెలియడంతో గ్రామస్తులు అవాక్కయ్యారు. పోలీసులు వినోద్ స్నేహితులు, కార్పెంటర్‌ను, అనుమానిత నాయకుడి అనుచరులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి విచారణ జరుపుతున్నారు.

ఇదెక్కడి బాదుడు చంద్రబాబూ..

- స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీపీఎం నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచింది. ఇదెక్కడి బాదుడు చంద్రబాబూ అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు' అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ఆ పార్టీ నేతలు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నగరంలోని 54వ డివిజన్ వెంకటేశ్వరపురం జనార్దనరెడ్డి కాలనీ వద్ద ఉన్న సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు, గృహాలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారన్నారు. అనేకచోట్ల విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రూ.17 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. అనంతరం స్థానిక విద్యుత్ శాఖ ఏఈ కృష్ణవేణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, మూలం ప్రసాద్, రషీద్, పద్మ, గడ్డం శ్రీనివాసులరెడ్డి, జాఫర్, వెంకటరత్నం, రామ్మోహన్, అల్లాభక్షు, ఆర్టీసీ బాబు, తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

కండలేరులో 28.098 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 28.098 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,000, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 100, హైలెవల్ కాలువకు 10, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.



సమస్యల్ని విన్నవిస్తామయ్యా..

- రైతులకు అనుమతి నిరాకరణ



ఆందోళన చేస్తున్న కరేడు గ్రామ రైతులు

నెల్లూరు(పొగతోట): బలవంతపు భూసేకరణ ఆపాలని ఉలవపాడు మండలం కరేడు గ్రామ రైతులు విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జీఓ నంబర్ 43ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీఆర్సీ సమావేశంలో మంత్రులను కలిసేందుకు రైతులను పోలీసులు అనుమతించలేదు. సమస్యను విన్నవించుకుంటామని ప్రాధేయపడినా కనికరించలేదు. సుమారు 4 గంటలపాటు రైతులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ సందర్భంగా కరేడు భూ సేకరణ వ్యతిరేక కమిటీ నాయకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ పరిశ్రమల కోసం జిల్లా వ్యాప్తంగా 52 వేల ఎకరాలను భూసేకరణ చేయడం జరిగిందన్నారు. వాటిలో పదివేల ఎకరాల్లో పరిశ్రమ స్థాపించారని తెలిపారు. మిగిలిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా కరేడు రైతులకు అన్యాయం జరిగేలా భూ సేకరణ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ అధ్యక్షుడు సునీల్, కరేడు గ్రామ రైతులు బొమ్మిరెడ్డి పవన్‌రెడ్డి, సీతారామ్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూములు తీసుకోవద్దు

సైదాపురం: పేదలు సాగు చేసుకుంటున్న భూములు తీసుకోవద్దని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు పెంచలయ్య అన్నారు. ఆ సంఘం నేతలు గిరిజనులతో కలిసి బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పనిచేసిన తహసీల్దార్ గిరిజనుల భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా తాము కలెక్టర్, జేసీ దృష్టికి తీసుకెళ్లడంతో విరమించారని గుర్తుచేశారు. మళ్లీ ఆ భూములను స్వాధీనం చేసుకునే చర్యలు ఆపాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు చెంచు మల్లికార్జున, మహిళా విభాగం అధ్యక్షురాలు చెంబేటి ఉష, నేతలు మల్లి, నాగరాజు, కోలా రమేష్, ఏకోలు శ్రీనివాసులు, అనంతయ్య, వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఏకోలు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల పోరాటం

- ఎన్ఎంసీ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయింపు
- డీఆర్సీ సమావేశానికి హాజరైన మంత్రులను కలిసే ప్రయత్నం
- కొందరు నాయకులు, కార్మికులను అడ్డుకున్న పోలీసులు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

నెల్లూరు(బారకాసు): పారిశుద్ధ్య పనులను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించే చర్యలను ఉపసంహరించుకోవాలంటూ బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో పెద్దఎత్తున నగరంలోని దర్గామిట్ట ప్రాంతంలోని బారాషహీద్ దర్గా వద్దకు కార్మికులు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై బైఠాయించారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన కమిషనర్ నందన్‌ను అడ్డుకుని తమ సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు, కార్మికులు నిలదీశారు. దీంతో కమిషనర్ తన పరిధిలో లేదని చెప్పగా అయితే వెళ్లనిచ్చేది లేదన్నారు. దీంతో ఆయన వెనుదిరిగారు. ఆ తర్వాత జిల్లా పరిషత్ ఆఫీస్‌లో డీఆర్సీకి హాజరైన మంత్రులను కలిసేందుకు కార్మికులు ర్యాలీగా బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచలనరసయ్య, కొందరు నాయకులు, కార్మికులను వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో వారిని విడుదల చేయకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని కార్మికులు డీఆర్సీ వద్దకు వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు ఆపి పదిమందిని లోపలికి పంపించడం జరిగింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఇదే సమావేశానికి హాజరైన మంత్రి నారాయణను కలిసి వినతిపత్రం అందించారు. నారాయణ మాట్లాడుతూ ఇది రాష్ట్ర వ్యాప్త పాలసీ కాబట్టి సీఎంతో మాట్లాడి చెబుతామన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించే ప్రక్రియను వెంటనే ఆపాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కొండా ప్రసాద్, కత్తి శ్రీనివాసులు, సుజాతమ్మ, మాలకొండయ్య, జి.నాగేశ్వరరావు, సూర్యనారాయణ, సుధాకర్, వజ్రమ్మ, కామాక్షమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): స్నేహితుడిని దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం నెల్లూరులోని నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. భగత్‌సింగ్ కాలనీకి చెందిన పూడి వంశీకృష్ణ (26), కిసాన్ నగర్‌కు చెందిన మల్లు సుధీర్ స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసై నిత్యం మద్యం తాగుతుండేవారు. ఇటీవల వారి మధ్య విభేదాలు నెలకొన్నాయి. సుధీర్ ఇంట్లో లేని సమయంలో వంశీకృష్ణ వెళ్లి వస్తువులను ధ్వంసం చేశాడు. కక్ష పెంచుకున్న సుధీర్ ఎలాగైనా స్నేహితుడిని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 18వ తేదీ అర్ధరాత్రి వంశీ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడని తెలుసుకుని వెళ్లాడు. అతను నిద్రపోతుండగా సుధీర్ నీళ్ల మోటార్‌తో ముఖంపై విచక్షణారహితంగా దాడి చేసి చంపి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా మంగళవారం సాయంత్రం ప్రశాంతినగర్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసును త్వరితగతిన ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన వేణుగోపాల్‌రెడ్డి, ఎస్సైలు రెహమాన్, శివయ్య, సిబ్బంది ఎస్.ప్రసాద్, ఆర్వీ రత్నయ్య, ఎం.వేణు, జి.మస్తానయ్య, షేక్ గౌస్‌బాషాను ఏఎస్పీ సౌజన్య అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

బైక్‌ను ఢీకొట్టిన ఆటో

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: జాతీయ రహదారిపై వెళ్తున్న మోటార్‌బైక్‌ను వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందగా, ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని వెంకటాచలం సమీపంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన ఎస్.గణేష్ (35), దినేష్, అభిలాష్ దుస్తులు కొనుగోలు చేసేందుకు బైక్‌పై నెల్లూరుకు బయలుదేరారు. బైక్ వెంకటాచలానికి చేరుకోగా వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గణేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. దినేష్, అభిలాష్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలించారు. గణేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గణేష్ మృతదేహం

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని..

- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

దగదర్తి: మండలంలోని ఉలవపాళ్ల జాతీయ రహదారిపై ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం ఆగి ఉన్న వాహనాన్ని మోటార్‌బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు కిసాన్‌నగర్‌కు చెందిన షేక్ ఉస్మాన్ షరీఫ్ (29) తన స్నేహితుడు గణేష్‌తో కలిసి కావలి వైపు మోటార్‌బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై మరమ్మతులకు గురై ఆగి ఉన్న అశోక్ లేలాండ్ దోస్త్ వాహనాన్ని బైక్ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉస్మాన్ షరీఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గణేష్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న దగదర్తి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గణేశ్‌ను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కావలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బంధువులు నెల్లూరులోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జంపాని కుమార్ వెల్లడించారు.



షరీఫ్ మృతదేహం

ఖాళీ బిందెలతో నిరసన

రాపూరు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గిరిజన మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాపూరు సమీపంలోని ఆంజనేయపురం గిరిజనవాడలో రెండు వారాల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, దీనిపై పలుసార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. విద్యుత్ లేకపోవడంతో మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సుదూరంలోని బోరు వద్దకు వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో ఖాళీ బిందెలతో సబ్‌స్టేషన్‌కు చేరుకుని, నిరసన చేపట్టామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ కార్తీక్ హామీ ఇవ్వడంతో వెళ్లిపోయారు.



గిరిజన మహిళలు

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.27
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:134
లేయర్ (లైవ్)	:112
బ్రాయిలర్ చికెన్	:240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:264
లేయర్ చికెన్	:190